www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025



జంట హత్యకేసులో జిల్లా కోర్టు సంచలన తీర్పు

ఐదుగురికి ఉరి శిక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సరిగ్గా పదేళ్ళ క్రితం జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నాటి మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్‌లు నగర పాలక సంస్థకార్యాలయంలో అత్యంత కిరాతకంగా హత్య చేయబడ్డారు. ఈ కేసులో 23 మందిపై నాడు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడిగా చంద్రశేఖర్ (చింటూ) స్వయాన కఠారి మోహన్‌కు మేనళ్లుడు, మాజీ ఎంఎల్‌ఏ సీకే బాబు, కఠారి మోహన్‌లకు ఉన్న వైరంతో నాడు సబ్‌మేరియన్‌లో ఇంజనీర్‌గా పనిచేసే చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేసి మేనమామతో కలసి సీకే బాబును హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఎంఎస్ఆర్ వద్ద కాల్పులు, బాబు బాస్టింగ్‌లో కఠారి మోహన్‌తో పాటు చింటూపై కూడా కేసులున్నాయి.

కఠారి మోహన్ పోలీసుల ఎదుట లొంగిపోవడం కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం కార్పొరేషన్‌ను కైవసం చేసుకొని కఠారి అనురాధ చిత్తూరు కార్పొరేషన్ తొలిమేయర్‌గా ఎన్నికైయ్యాక మేనమామ కఠారి మోహన్, మేనళ్లుడు చంద్రశేఖర్‌కు ఆర్థిక అంశాలపై విబేధాలు రావడంతో మేనత్త కఠారి అనురాధ, మేనమామ కఠారి మోహన్‌లను బుర్కాలు ధరించి పట్టపగలే కార్పొరేషన్ కార్యాలయంలో 2015 నవంబర్ 17వ తేదీన హత్యకు ప్లాన్‌చేశారు. మేయర్ ఛాంబర్‌లోని సీటులో అనురాధను కూర్చుని విధి నిర్వహణలో ఉండగా ఆమె భర్త మోహన్‌తోపాలు పలువురు టిడిపి నాయకులు అక్కడే ఉన్నారు. అదే సమయంలో చాంబర్‌లోకి తూపాకులు, కత్తులతో దూసుకుని వచ్చిన చంద్రశేఖర్ మిగిలిన వారితోకలిసి మేయర్ అనురాధను తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే మరణించారు. వెంటనే ఆమె భర్తను కత్తులతో వేటాడి చంపారు.

ఆనాడు రాష్ట్రంలోనే సంచలనం రేపిన కేసులో ఏ 1 నుండీ ఏ 5 వరకు చంద్రశేఖర్ (చింటూ), వెంకటాచలపతి, జయప్రకాశ్ రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లను సుదీర్ఘ విచారణ అనంతరం తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఐదుగురు దోషులకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. సుదీర్ఘ విచారణలో 130 మంది సాక్షులను కోర్టు విచారించింది. దోషుల తరపున న్యాయవాదులు శిక్ష తగ్గించాలని సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. జైలులో వారి ప్రవర్తన, ఆరోగ్య పరిస్థితుల పైన నివేదికను తెప్పించుకున్నారు. ఐదుగురిపై నేరం రుజువు కావడంతో మిగిలిన 18 మందిని కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఉరి శిక్ష పడ్డ ఏ1 నుండీ ఏ5 దోషులను పోలీస్ భద్రత నడుమ కడప సెంట్రల్ జైల్‌కు తరలించారు.

అనేక ఒత్తిళ్ళు ఎదుర్కొనాం: కఠారి హేమలత



సాక్షులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, తమ కుటుంబ సభ్యులను బెదరించినా అనేక ఒత్తిళ్ళను ఎదుర్కొని నిలబడ్డామని కఠారి దంపతుల కోడలు మాజీ మేయర్ ప్రస్తుత చుడా ఛైర్మెన్ కఠారి హేమలత తెలిపారు. తీర్పు వెలుబడిన తరువాత కోర్టు ఆవరణంలో ఆమె మాట్లాడుతూ తమ అత్తమామలను అత్యంత కిరాతకంగా హత్యచేసిన వారికి ఉరి శిక్ష పడటం న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచిందన్నారు.



హత్యకు గురైన కఠారి దంపతులు (ఫైల్‌ఫోటో)

నేరం రుజువైంది: పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ



నగర మేయర్ జంట హత్యల కేసులో ఐదుగురిపై నేరం రుజువు కావడంతో ఉరి శిక్ష పడిందని జంట హత్యల కేసును విచారించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ అభిప్రాయం వ్యక్తం చేశారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో 23మంది ముద్దాయిలో ఒకరు చనిపోయారని, మరోకరికి ప్రమేయం లేదంటూ తొలగించడం జరిగిందని, మరో 18 మందికి కూడా హత్యలో ప్రత్యక్ష ప్రమేయం లేకపోవడంతో నిర్దోషులుగా జిల్లా కోర్టు ప్రకటించిందని తెలిపారు. ప్రత్యేక ప్రమేయం ఉన్న ఐదుగురికి జిల్లా కోర్టు ఉరిశిక్ష ఖరారు చేసిందని తెలిపారు. అలాగే నష్టపరిహారం కింద కఠారి కుటుంబానికి రూ.50లక్షలు, ప్రధాన సాక్షి సతీష్ కుమార్‌కు రూ.20లక్షలు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిదన్నారు.

అపీల్‌కు వెళ్ళతాం: చింటూ తరుపు లాయర్ విజయచంద్రారెడ్డి



జంట హత్యల కేసులోఏ 1 నుండీ ఏ 5 వరకు ఉన్న దోషులకు ఉరి శిక్ష విధించడం పట్ల హైకోర్టు అపీల్‌కు వెళ్ళనున్నట్లు ముద్దాయిల తరుపు లాయర్ విజయచంద్రారెడ్డి తెలిపారు. రాజకీయ నేతల ఒత్తిళ్ళతో పోలీసులు వివిధ సెక్షన్లు పెట్టారని, బాధితులకు కాంపెన్‌జేషన్ అవసరం లేదని అన్నారు. అపీల్‌కు 90 రోజుల సమయం ఉందని తెలిపారు.

తీవ్రంగా ఒత్తిడి చేశారు: ప్రధాన సాక్షి సతీష్



జంట హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న తనను వేధింపులకు గురి చేయడంతో పాటు తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలంటూ ఒత్తిడి చేశారని జంట హత్య కేసులో ప్రధాన సాక్షి సతీష్ తెలిపారు. చింటూ ఒత్తిళ్ళు తట్టుకోలేక కోన్ని సంవత్సరాలు ఊర్లో ఉండకుండా మరో ప్రాంతంలో ఉండాల్సి వచ్చిందని వాపోయారు.

న్యాయం గెలిచింది: కఠారి దంపతుల కుమార్తె లావణ్య



తన తల్లిదండ్రులను హత్యచేసిన వారికి ఉరి శిక్ష పడ్డంతో న్యాయం గెలిచిందని కఠారి దంపతుల కుమార్తె లావణ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న తన తల్లి అనురాధ, పక్కనే ఉన్న తన తండ్రి కఠారి మోహన్‌లను అత్యంత కిరాతకంగా హత్య చేసిన వారికి న్యాయస్థానం తగిన శిక్ష విధించిందని ఇలాంటి ఘాతుకాలకు పాల్పడాలంటే భయపడేలా కోర్టు తీర్పు ఉందన్నారు.



ఉరి శిక్ష పడిన ఐదుగురు దోషులు

2న ఎల్వీఎం3-ఎం5 ప్రయోగం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్లోని రెండో ప్రయోగవేదిక నుంచి నవంబర్ 2వ తేదీ సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగానికి సంబంధించి మిషన్ డైరెక్టర్ ఆధ్వర్యంలో అన్ని పరీక్షలు పూర్తిచేసి శుక్రవారం షార్లోని బ్రహ్మప్రకాష్లలో మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. లాబ్ చైర్మన్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగాన్ని 16.09 నిమిషాల్లోనే ప్రయోగాన్ని పూర్తి చేసేలా శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. 43.5 మీటర్ల పొడవు కలిగిన ఎల్వీఎం3 రాకెట్ ప్రయోగ సమయంలో 642 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి ఎగరనుంది. 4,400 కిలోలు బరువు కలిగిన సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని భూమికి దూరంగా 29,970 కిలోమీటర్లు, భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు ఎత్తులోని జియో ట్రాన్స్ఫర్ ఆర్బిట్లోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఉపగ్రహాల నియంత్రణ కేంద్రమైన హసన్లోని శాస్త్రవేత్తలు ఉపగ్రహంలోని అపోజి ఇంధనాన్ని మండించి మూడు నాలుగు విడుతల్లో భూమికి 36 వేలు కిలోమీటర్లు ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం భారత భూభాగంతో సహా విస్తత సముద్ర ప్రాంతంలో సేవలను అందిస్తుంది. చంద్రయాన్ 3 ప్రయోగానికి కీలకంగా పనిచేసిన మొదటి ఎల్వీఎం 3 రాకెట్‌ను ఈ ప్రయోగంలో ఉపయోగిస్తున్నారు.



ప్రయోగానికి సిద్ధమవుతున్న ఎల్వీఎం3- మిషన్ 5 రాకెట్

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

తుంబకుప్పం పిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్

పజాశక్తి- బంగారుపాళ్యం

తుంబకుప్పం ఆసుపత్రి అభివృద్ధికి మౌలిక వసతులు కొరకు నివేదికల సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ బంగారుపాల్యం మండలం తుంబ కుప్పం పిహెచ్‌సి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సిలో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ ప్రజలకు తాగునీరు, వైద్య సేవల అందుబాటు, శుభ్రత పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు చేసేలా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించి అవగాహన పెంచాలన్నారు. మూడు నెలలకు అత్యవసర డ్రగ్స్, ల్యాబ్ రీజన్స్, సానిటరీ ఐటమ్స్ కొనుగోలు చేయాలని, డాక్టర్లు సకాలంలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. పిహెచ్‌సిలో అందించే మందులు వివరాలకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేసి స్టాఫ్ అటెండెన్స్, వ్యాక్సిన్ మెయింటెనెన్స్, డెలివరీ, లేబరేటరీ, మందుల నిల్వను తనిఖీ చేసి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్ డిడి జయరాజు, డిపిఓ సుధాకర్, పిహెచ్‌సి డాక్టర్ లోహిత్, హోమియోపతి వైద్యాధికారి సెల్వరాజు, డిప్యూటి తహశీల్దార్ కళ్యాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలోని రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

వేగంగా బైపాస్ రోడ్డు పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక పరిధిలో కట్టమంచి -సాంబయ్య కండ్రిగ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సాంబయ్య కండ్రిగ వద్ద రోడ్డు పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. రోడ్డుకి ఇరువైపులా కరెంటు స్తంభాలను తొలగించాలని, రోడ్డు విస్తరణకు అనుగుణంగా ఆక్రమణల తొలగింపు పనులు వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీనగర్ కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిసి కాలనీలో కాలువలు నిర్మించాలని కోరారు. కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఎసీపీ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు

బాబు నగర్ పునర్నిర్మాణానికి ప్రణాళికలు: కడా పీడీ



శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలిస్తున్న కడా పీడీ


ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బాబు నగర్‌ను కడ పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం సందర్శించారు. బాబు నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న పలు గృహాలను ఆయన పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడారు. బాబునగర్ కాలనీలోని నివాస గృహాలు దాదాపు అన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని తొలగించి ఆధునిక వసతులతో పేదలకు గృహాలు నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2026 మార్చిలో పనులను ప్రారంభించి 2027 సంక్రాంతికి గృహప్రవేశాలు చేసుకునే విధంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని పీడీ హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు తమకు పక్క గృహాలు నిర్మించి ఇచ్చారని అందుకే కాలనీకి బాబు నగర్‌గా పేరు పెట్టుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. బాబు నగర్‌లో నివాసం ఉంటున్న వారికి కొత్త గృహాలను నిర్మించి ఇచ్చేందుకు అవసరమైన ఎస్టిమేట్లు తయారు చేయాలని తానే స్వయంగా సీఎం వద్దకు వెళ్లి వాటిని మంజూరు చేసుకుని వస్తానని అధికారులకు సూచించారు. రెస్కో ఛైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, రామచంద్ర, సతీష్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ మున్సిపల్, అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కమిషనర్ శ్రీనివాస్ రావు, ఏపీటిఐ బిడిసిఓ దేవిక, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మందుల సరఫరాకు కొత్త వాహనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో మంజూరు చేసిన వివిధ పిహెచ్సిలకు మందులు సరఫరా చేసే కొత్త వాహనాన్ని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ వెహికల్ ద్వారా జిల్లాలోని అన్ని పీహెచ్‌లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ తేజ్ రాయి, గిరి సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ లబ్ధిదారులు టెన్షన్

- రీ వెరిఫికేషన్ పేరుతో కోతలు
- 15 వేల లబ్ధిదారుల పెన్షన్లు డిజేబుల్ పెన్షన్లుగా మార్పు
- గతంలో వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడు ఎందుకూ పనికిరావు..?



ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): గతంలో ఇదే వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడెందుకు పనికిరావు అంటూ వికలాంగులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద ఇచ్చే సామాజిక బాధ్యత పెన్షన్లను అనర్హులు పొందుతున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ సర్ప్ అధికారులు నోటీసులు అందించారు. దీంతో వికలాంగ పింఛన్ల కుదింపులు, తగ్గింపులు, రీ వెరిఫికేషన్‌ల పేరుతో చిత్తూరు జిల్లాలోని వికలాంగులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

గత నెల పెన్షన్లకి ఈనెల ఇస్తున్న పెన్షన్లకి వ్యత్యాసాలు ఉంది. పూర్తిగా అంగవైకల్యం ఉన్న వారికి హెల్త్ ఫంక్షన్స్, పెరలిసిస్ పెన్షన్స్ బెడ్రెట్స్ పెన్షన్లు 15000 పెన్షన్లు గత నెలకి ఇప్పుడు ఇస్తున్న నెలకి తేడా ఉంది. అలాగే డిజేబుల్ పెన్షన్స్ లోనూ కోత విధించారు. రీ వెరిఫికేషన్‌లో హెల్త్ పెన్షన్, డిజేబుల్ పెన్షన్లకి గత నెల ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ల వివరాలకు తేడాలు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో మొత్తం పెన్షన్స్ 2,68,066 పెన్షన్లకు 114.46 కోట్ల రూపాయలు ప్రతినెలా పంపిణీ చేస్తున్నారు. ఇందులో గత నెలలో డిజేబుల్ పెన్షన్స్ 34,672 పెన్షన్స్ పంపిణీ చేశారు. నవంబర్ ఒకటవ తేదీ 34,155 పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 517 పెన్షన్లు తగ్గుతున్నాయి. అదేవిధంగా పెరాలసిస్ పెన్షన్స్, బెడ్ రెస్ట్ పెన్షన్స్ గత నెలలో 987 గాను ప్రస్తుతం 793 పెన్షన్స్ పంపిణీ చేస్తున్నారు ఇందులో 194 పెన్షన్స్ తగ్గాయి, అలాగే యాక్సిడెంట్స్ ఫంక్షన్స్‌లో గత నెల 886 ఈనెల 693 పెన్షన్స్ పంపిణీ చేస్తున్నారు ఇందులో 193 పెన్షన్స్ కోత విధించారు. ప్రస్తుతం పెన్షన్స్ రీవెరిఫికేషన్ పేరిట నెతా కోత విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారు. ఇన్నాళ్లు అందుతున్న పెన్షన్స్ ఎప్పుడు ఆగిపోతుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెలలో వికలాంగులు డిజేబుల్స్ పెన్షన్ భారీగా కోత పెట్టే అవకాశాలు అధికంగా ఉన్నాయి.



ప్రజాశక్తి కథనంతో కదిలిన అధికార యంత్రాంగం

హాస్టల్స్‌ను పరిశీలించిన కడా పీడీ

నూతన భవనాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీ మునస్వామిపురం ఎస్సీ, బీసీ హాస్టల్ భవనాలను శుక్రవారం కడ పీడీ వికాస్ మర్మత్ పరిశీలించారు. హాస్టల్ దుస్థితిపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. కడ పీడీ వికాస్ మర్మత్ హాస్టల్ భవనాలను పరిశీలించారు. రెండు హాస్టల్లో ఎంతమంది చదువుకుంటున్నారు, గతంలో హాస్టల్లో ఎంతమంది చదువుకునే వారిని ఆరా తీశారు. హాస్టల్ భవనాలను మరమ్మతులు చేసే అవకాశం ఉందంటూ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాలను తొలగించి ఆధునిక వసతులతో నూతన భవనాలను నిర్మించేందుకు అవసరమైన ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని అధికారులను పీడీ ఆదేశించారు. విద్యార్థులకు ప్లే గ్రౌండ్‌తో పాటు హాస్టల్ భవనం నిర్మించాలని దీనికి సంబంధించి ఎస్టిమేట్ల సద్ధం చేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి నిధులు కేటా ఇస్తామని పేర్కొన్నారు. సుమారు నాలుగు కోట్ల రూపాయలతో ఎస్సీ, బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి పీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గంలోని అన్ని హాస్టలను పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ ముందువైపు పారిశుధ్యం అపరిశుభ్రంగా ఉండడం పట్ల పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రబ్బానీ బాష, మీనాక్షి, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, రామచంద్ర, సతీష్, కమిషనర్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, ఏఎస్‌డబ్ల్యూఓ శివుడు వార్డెన్లు పాల్గొన్నారు.



అంగన్వాడీ మహాసభలు విజయవంతం

నూతన అధ్యక్ష కార్యదర్శులుగా లలిత, షకీలా



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) చిత్తూరు జిల్లా 5వ మహాసభలు రెండు రోజులు పాటు చిత్తూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో విజయవంతంగా శుక్రవారం ముగిసాయి. ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడం జరిగింది. మహాసభల్లో సిఐటియు నాయకులు వాడ గంగరాజు, గిరిధర్ గుప్తా పాల్గొన్నారు. అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, అంగన్వాడీలకు సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు, అంగన్వాడీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, జిల్లాలో కొన్ని ప్రాజెక్టులలో అధికారులు అంగన్వాడీలను మానసికంగా ఇబ్బంది పెట్టే మాటలతో హింసించడం మానుకోవాలని, హెల్పర్లకు ప్రమోషన్ల విషయంలో అధికారులు చిత్తశుద్ధిని పాటించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలి, 5జీ కొత్త ఫోన్లు, మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్ గా వెంటనే చేసి హెల్పర్ల ఏర్పాటు, అదనపు పనులు చేయించరాదంటూ మహాసభ తీర్మానించింది.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా అధ్యక్షురాలు కెపి.లలిత, ప్రధాన కార్యదర్శి షకీలా, కోశాధికారి విజయ, ఉపాధ్యక్షురాలు ప్రమీల, లీలావతి, మమత, సుజని, కార్యదర్శులు పద్మ, ధన కోటి, అనితలతోపాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగోన్నత పొందిన వారిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: సమగ్ర శిక్షా చిత్తూరు కార్యాలయంలో ఏపీసి మద్దిపట్ల వెంకటరమణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా చిత్తూరు ఇంజనీరింగ్ విభాగంలో బదిలీ పొందుతున్న జె.మధుసూదన్ రావు, ఏఈగా వెంకటరమణ, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ని శుక్రవారం సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు సన్మానం జరిగింది. జే.మధుసూదన్‌రావు సమగ్రశిక్షలో గత తొమ్మిది సంవత్సరాలుగా ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి బదిలీపై వెళుతున్నారు. వెంకటరమణ గత 24 సంవత్సరాలుగా సమగ్ర శిక్ష నందు ఈఈ గా బాధ్యతలను నిర్వహించి ప్రస్తుతం ఏపీఈడబ్ల్యూ ఐడిసికి బదిలీపై వెళుతున్నారు.

కుప్పం ఏరియా ఆసుపత్రి

వైస్ చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ఏరియా ఆసుపత్రి నూతన కమిటీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. ఆస్పత్రి వైస్ చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి త్రిలోక్ బాధ్యతలు స్వీకరించారు. కుప్పం మున్సిపల్ టిడిపి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన త్రిలోక్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నేటికీ అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. త్రిలోక్ భార్య భాగ్యలక్ష్మిని ఆసుపత్రి వైస్ చైర్పర్సన్‌గా నియమించగా నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. కుప్పం ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రి నూతన కమిటీని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, పికేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణు, నాయకులు గిరి అభినందించారు.

రాళ్ళబూదుగూరును పరిశీలించిన కడా పీడీ

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరు గ్రామంలో కడా పీడీ వికాస్ మర్మత్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించారు, అలాగే గ్రామాభివృద్ధి కోసం చేపట్టవలసిన పనుల గురించి తెలుసుకొని సంబంధిత అధికారులకు మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా చేయాలని అధికారులు ఆదేశించారు. రాళ్ళబూదుగూరు గ్రామం, పరిసర ప్రాంతాలు చాలా బాగున్నాయని, గ్రామ అభివృద్ధి కోసం కడ నిధుల ద్వారా సుమారు రూ.60 లక్షల మంజూరు చేయనున్నట్టు తెలిపారు. రాళ్ళబూదుగూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల అలాగే నిర్మాణ దశలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవాలయం, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంకటేశ్వర స్వామి దేవాలయం, గ్రామ కోనేరు సందర్శించారు. ఎంపీడీవో ఏపీఆర్.కుమార్, తహశీల్దార్ ఎం.ప్రకాష్ బాబు, ఎస్సైఐ నరేష్, మండల టిడిపి అధ్యక్షులు ఉదయ్‌కుమార్, రాళ్ళబూదుగూరు సర్పంచ్ లక్ష్మి మురుగేష్, యూనిట్ ఇంచార్జ్ ఆర్ఎస్.మని, క్లస్టర్ ఇంచార్జ్ పీవీ.నాగరాజు, రాజేంద్ర, డైరెక్టర్లు బసవరాజు, అనసూయ, కడ మెంబర్ సుగుణమ్మ పాల్గొన్నారు.

అన్యాయాలను అడ్డుకోలేరా?

- కొనసాగుతున్న బాల్య వివాహాలు, బెల్టుషాపులపై సుదీర్ఘచర్చ
- ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి-సోమల: మండలంలో బాల్య వివాహాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అభం శుభం తెలియని బాలికలు అన్యాయానికి గురవుతున్నారని, నాటు సారా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా మండలంలో కొనసాగుతున్నా సంబంధిత శాఖ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని వీటిని అరికట్టాలని ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు.

తహశీల్దారు మధుసూదన్ అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సమావేశం ఎంపిడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాటూరి మురళి, రామనాథం, మొగిలీ శ్వరయ్య, కృష్ణయ్య ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో, దళితవాడలో నెలకొన్న సమస్యలపై సభ దృష్టికి తెచ్చారు. కందూరు, సోమల, పెద్ద ఉప్పరపల్లి గ్రామాలలో కమ్యూనిటీ భవనాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని, కమ్యూనిటీ భవనాన్ని ప్రభుత్వ నిధులతో నిర్మించాలని కోరారు. మండల కేంద్రంలో, మేజర్ పంచాయతీ కందూరులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని చూపాలని, ఎన్ని ప్రభుత్వాలు మారినా అధికారులు మారినా దళితవాడ ప్రజలకు శ్మశాన వాటికలు లేక వంకల్లో, వాగుల్లో, చెరువులలో ఖననం చేస్తున్నారని వెంటనే శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి దళిత వర్గాలకు చెందిన కొందరికి గత ప్రభుత్వాలు వ్యవసాయం చేసుకునేందుకు భూములు కేటాయించాయని వాటిని భూస్వాములు ఆక్రమించి దళితులకు అన్యాయం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత వాడల్లో అనేక గ్రామాలలో మురుగు నీటి కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని, జనన మరణ ఇతర ధ్రువపత్రాలను ఎస్సీ, ఎస్టీలకు మంజూరు చేయడంలో ఆలస్యం అవుతోందన్నారు. ముఖ్యంగా మానిటరింగ్ కమిటీ సమావేశానికి మండలంలోని నాలుగు బ్యాంకుల అధికారులు గైర్హాజరవుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో బాల్యవివాహాలు చోటు చేసుకుంటున్నా ఐసిడిఎస్ పట్టించుకోకపోవడంతో బాలికలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. సూపరువైజరు హరిత మాట్లాడుతూ తమకు సమాచారం తెలిసిన వెంటనే బాల్యవివాహాలను అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వినకపోతే పోలీసుల సాయంతో అరికడుతున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు తెలిస్తే తమ దృష్టికి తేవాలని సూచించారు. నాటు సారా, బెల్ట్ షాపుల కారణంగా దళిత కుటుంబాలలో మద్యానికి బానిసలవుతున్నారని సభ్యులు తెలిపారు. పుంగనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎస్ఐవేణుగోపాల్ రెడ్డి స్పందిస్తూ తమ పరిధిలో నాలుగు మండలాలు వున్నాయని, సిబ్బంది ఏడుగురే వుండడంతో సమాచారం అందిన వాటిపైనే దాడులు చేసి అరికడుతున్నామన్నారు. తమకు వివరాలు ఇస్తే అరికడ తామన్నారు. తహశీల్దారు మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు, శ్మశాన వాటికలకు స్థలాన్ని పరిశీలించి కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, అటవీ, హౌసింగ్ ట్రాన్స్‌కో, విఆర్‌వోలు, సాంఘిక సంక్షేమ శాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ

క్రైం న్యూస్

ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -వి కోట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పేర్నంబట్- వి కోట జాతీయ రహదారిలోని రామతీర్థం గ్రామ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తమిళనాడు పెర్నంబట్‌కు చెందిన అహ్మద్ అలీగా గుర్తించారు. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు పేర్నంబట్‌కు చెందిన అహ్మద్ అలీ, కుమారుడు, అతని భార్య జబిన్ తాజ్ గురువారం రాత్రి సుమారు 8.30 గంటల ప్రాంతంలో పేర్నంబట్ నుండి కేజిఎఫ్‌కు ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. మండల పరిధిలోని రామతీర్థం వద్ద ఒక ట్రాక్టర్ వెనుక వైపు రివర్స్ చేస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడని, మృతుడి కుమారుడు మాజ్ తెలిపాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని వి కోట ప్రభుత్వ ఆస్పత్రికి తలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు వికోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవరదొడ్డిలో
మరో రోడ్డు ప్రమాదం
ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి మరువక ముందే ఆ స్థలంలో శుక్రవారం మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బైరెడ్డిపల్లి- వికోట జాతీయ రహదారిలోని దేవదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లి- వికోట జాతీయ రహదారిలోని దేవదొడ్డి వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళుతున్న దేవదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణప్ప (51)కు ఎడవ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ద్విచక్ర వాహనంలో వెళుతున్న కుప్పం మండలం వరుడికుప్పం గ్రామానికి చెందిన గంటలప్ప (60) తీవ్రంగా గాయపడ్డ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో మెరుగైన చికిత్స కోసం కుప్పం పిఇఎస్ హాస్పిటల్ తరలించారు. ట్రైనింగ్ ఎస్ఐ జయశ్రీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ స్థలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి విజయపురం (నగరి): మండలంలోని తడుకుపేట రైల్వే స్టేషన్ సమీపం గంజాయి అక్రమ రవాణాతో పాటు, విక్రయాలు చేస్తున్న తడుకుపేటకు చెందిన సుమన్ (42), దేవ (22) నగరి ఇందిరానగర్‌కు చెందిన తరుణ్ (20)లను శుక్రవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు గంజాయి విక్రయిస్తున్నట్లు ముందస్తు అందిన సమాచారం మేరకు తడుకుపేట రైల్వేస్టేషన్ సమీపం ఎస్ఐ విజయ్‌నాయక్‌తో పాటు కాపు కాసిన పోలీసులు ద్విచక్రవాహనంలో గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30 వేలు విలువచేసే 1.5 కేజీల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరిలో సుమన్ వ్యక్తిపై గతంలో పలు చోరీకేసులు నమోదుకాగా, దేవాపై గంజాయి కేసు పెండింగ్‌లో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారు. ఎక్కడికి తరలిస్తున్నారనే అంశాలపై క్షేత్రస్థాయిలో విచారిస్తున్నామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -కుప్పం: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని, సమన్వయ కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలోనూ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి పార్టీ క్యాడరును మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రామచంద్ర, రెస్కో డైరెక్టర్ మురళి, క్లస్టర్ ఇన్చార్జి,హైదర్ వలి,జెకె.సంతోష్, మణి, బగిడి వెంకటేష్, కనకరాజు,స్థానిక యూనిట్ ఇన్చార్జి చంద్ర, పార్టీ అధ్యక్షులు నరసింహులు, డీలర్ వెంకటేష్, పుల్లయ్య, శ్రీనివాసులు, బూత్ ఇన్చార్జి లు శశి, తిరుపతి, పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే మామిడి మొక్కలు పీకేశారు!
రెవెన్యూ అధికారులకు బాధితుడు ఫిర్యాదు

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం చిచిలి వారి పల్లె గ్రామపంచాయతీ గాజులపల్లికి చెందిన గుండ్లూరి శ్రీనివాసులుకు చెందిన భూమిలో నాటిన మామిడి మొక్కలను అగ్ర వర్ణాల వారు రాత్రికి రాత్రే పీకేశారు. తమ తాతల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమిని కాజేయాలని చూస్తున్నారని శుక్రవారం 'ప్రజాశక్తి'లో శ్రీనివాసులు చెప్పిన ఆవేదన వార్త రూపంలో ప్రచురితమైంది. ఈ విషయం తెలుసుకున్న పెత్తందారులు రాత్రికి రాత్రే తన పొలంలో ఉన్న మామిడి మొక్కలను పీకేశారని శ్రీనివాసులు శుక్రవారం రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. 105 మామిడి మొక్కలను పీకేసారని, ఈ విషయం గురించి వారిని అడిగితే కులం పేరుతో దూషిస్తున్నారని, సుమారు ఒక లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని శ్రీనివాసులు అన్నారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పిచ్చి మొక్కలు తొలగింపు

- నామమాత్రంగా పనులు
- నాణ్యత పాటించాలని ప్రజల అభ్యర్థన

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట డ్యాం వద్ద నుండి సదుం వరకు పుంగనూరు- సదుం ప్రధాన రహదారికి ఇరు వైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్నారు. రెండు ట్రాక్టర్లు, జెసిబి ద్వారా పనులు చేస్తున్న వారు చేస్తున్న విధానం వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


పిచ్చిమొక్కలు తొలగింపులో నాణ్యత లోపించిన దృశ్యం

క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లే అవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 30, జూన్ 2025 నాటికి రిజిస్టర్ అయిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీ కరించుకుకు ప్రభుత్వం జనవరి 23, 2026 వరకు పొడిగించారని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్పీ రమణారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అనధికార లే ఔట్లను కమిషనర్ పరిశీలించారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు కాశీ విశ్వేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ చేస్తున్న నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గం పేరొన్నారు. శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో కుమారస్ అధికారికంగా సభ్యుల చే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గుడి వైభవాన్ని మరింత పెంచే పని చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌పి రమణారెడ్డి, ఏఎంసి చైర్మన్ రాజన్న, కూటమి నాయకులు ఆర్వీ బాలాజీ, కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్,కిరణ్, గిరి, మురళీ,శేఖర్, సుబ్బు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆర్ మురళీ కృష్ణ, వైస్ చైర్మన్‌గా జీ మంజునాథ్, డైరెక్టర్లుగా జే సత్యవతి శ్రీ బాబు, వీరప్ప, మోహన మురళీ కృష్ణ, ఎంటీఆర్‌ప్రసాద్, రెడ్డెప్ప, కుమారస్వామి, గురుబల్, బీఆర్ సుజాత, మోహన ప్రియ, భువనేశ్వరి, శ్రీమధవ ఎన్నికయ్యారు.

పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వేలూరు పీఈఎస్ పాఠశాల వేదికగా ఈనెల 30, 31వ తేదీలలో స్పోర్టానియా -25 (శ్రీ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో దాదాపు 15 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, అందులో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన బ్యాడ్మింటన్ బృందం త్రో బాల్ రన్నర్ అప్ ను కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ లో అక్షయ, నవ్య బృందం బ్యాడ్మింటన్ రన్నర్ అప్ ను సొంతం చేసుకున్నారు. సుధీప్, పవన్ బ్యాడ్మింటన్ లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపల్ వై.వి.కృష్ణ బాబు శిక్షణను అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు అరవింద్ ని, విద్యార్థులను అభినందించారు.

దేశాభ్యుదయంలో ఇందిరాగాంధీది చెరగని ముద్ర: కాంగ్రెస్

ప్రజాశక్తి-కుప్పం: దేశ సమగ్ర అభివృద్ధిలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చెరగని ముద్రవేశారని కాంగ్రెస్ నేతలు మునిస్వామి, రోహినప్ప, నిజాం పేర్కొన్నారు. కుప్పం కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాగరాజు, తిమ్మప్ప ముని రామయ్య నివాళులు అర్పించారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మండలంలో వర్షాల కారణంగా బాధింపుకు గురైన కీళపట్టు ఆంజనేయస్వామి గుట్ట ప్రాంతంలోను, టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ కాలనీ వారికి కాపు సంఘ నేతలు శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నియోజకవర్గ బలిజ సంఘం అధ్యక్షులు ఎంవి బాబు ఆధ్వర్యంలో బాధితులకు బియ్యం, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, వేలు, జగదీష్, గాంధీ, శేఖర్, మణి, మల్లికార్జున్ అరుల్, ముత్తు, మధు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో నగరి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నగరి మున్సిపాలిటీ సత్రవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దేవిశ్రీ ప్రతిభ కనబరచి 3వ స్థానం దక్కించుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థినికి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరించింది.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 32 మంది విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ బయోమెట్రిక్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. డిజిటల్ అసిస్టెంట్ రాజేష్ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు పి ఆర్ శ్రీదేవి మాట్లాడుతూ తమ పాఠశాలలో 32 మంది విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ ఐరిష్ ఇతర అప్‌డేట్స్ చేయాల్సి ఉందని అధికారుల ఆదేశానుసారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పిల్లలకు ఇబ్బంది లేకుండా ఫోన్ నెంబర్ బ్యాంక్ అకౌంట్ కూడా ఆధార్‌లో పొందుపరుస్తున్నామని తెలిపారు.

నూరేపాకు ఘన సన్మానం

ప్రజాశక్తి - రొంపిచెర్ల: దూదేకుల నూర్ బాషా సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గుమ్మడూరు నూరేపాను రొంపిచెర్ల మండల వైసిపి నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ కరీము ల్లా మాట్లాడుతూ దూదేకుల నూర్ బాషా సామాజిక తరగతి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో దూదేకుల నూర్ బాషా కుల సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి తమ పాత్ర పోషించాలని కోరారు. అనంతరం పూల మాల వేసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కరీముల్లా, వైసిపి నాయకులు మంజూర్, గురు, బావాజీ సాహెబ్, ఓబులేసు, గౌస్ , రియాజ్, కిషోర్, సల్మాన్, సలీం, ముబారక్ పాల్గొన్నారు.


నూరేపాను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వరి పొలాలను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - వెదురుకుప్పం: ప్రస్తుత వర్షాలకు వరి పంటను పూర్తిగా కంటికి రెప్పలా రక్షించుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం, రామిరెడ్డిపల్లి, శాస్త్రవేత్తలు, జిల్లా ఏరువాక కేంద్రం చిత్తూరు, (డాట్ సెంటర్), ఆగ్రికల్చర్ ఆఫీసర్ ద్వారా ఏ రామకృష్ణాపురం వెదురు కుప్పం మండలం లోని 'రెంటాల చేను' 'చెంచుగుడి' 'వావిళ్ళ చేను' గ్రామాలలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. వరి పొలం కోతకు సిద్ధంగా ఉన్న 3 గ్రామాలలో 14 ఎకరాలలో ఇటీవల కురిసిన వర్షాలకు వరి కంకులు పడిపోయి నట్టు గమ నించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్‌వి సరళ, డాక్టర్ బి వసంత, మండల వ్యవసాయ అధికారి, వెదురుకుప్పం, ఏ వనిత రైతు సేవ కేంద్రాలు వీఎవోస్ఏ, కె నరేష్ పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - వెదురు కుప్పం: కార్వేటినగరం మండలం కెం పురం ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో చెరువును తలపిస్తున్న రోడ్డు అనే వార్త గురువారం ప్రచురితమైంది. స్పందించిన ఇన్ ఛార్జి ఎంపీడీఓ విద్యావతి ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి కనకరాజ్ శుక్రవారం దగ్గర ఉండి ఈ రోడ్డులోని నీళ్లను తొలగించారు. కార్యదర్శి కి సహాయంగా గ్రామస్థులు సోమశేఖర్ యాదవ్, గోపాల్ రెడ్డిలుసిద్ధిని శుభ్రం చేయించారు. విద్యార్థుల తల్లితండ్రులు, అక్కడి వాసులు అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు: ఆర్‌డీవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని పలమనేరు ఆర్డీఓ భవాని అన్నారు. శుక్రవారం బంగారుపాలెం తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం డీటీ కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాబు రాజేంద్రప్రసాద్‌కు దుశ్శాలు వాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారులు మధుసూదన్, ఇన్సు నాథన్, సీఐ శ్రీనివాసులు, మాజీ తహశీల్దారులు సుశీలమ్మ ,బెన్ రాజ్ పలువురు రెవెన్యూ సిబ్బంది, తహశీల్దార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సోమశేఖర్‌కు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు

ప్రజాశక్తి - శాంతిపురం: శాంతిపురం మండలంలోని ఎంకెపురం గ్రామానికి చెందిన ఎం జయరామి రెడ్డి కుమారుడు ఎం సోమశేఖర్ హైదరాబాద్ హైటెక్ సిటిలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు' అందుకున్నారు. పిల్లల్లో విలువల ఆధారిత విద్యను ప్రోత్సహించడంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను, ప్రేరణను కలిగించిందని, సమాజంలో విలువలను పెంపొందిస్తూ, విద్యార్థుల స్థాయిని మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన శుక్రవారం స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కాలేజీ బిల్డింగ్ పైనుంచి దూకిందని, ఈ ప్రమాదంలో విద్యార్థిని తీవ్రంగా గాయపడటంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారని తెలిపారు. ఈ ఘటనపై తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టిల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి గ్రామంలో ఎస్‌సి , ఎస్‌టిల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దాము, వ్యవసాయ అధికారి గీతా కుమారి మాట్లాడుతూ రాజ్యాంగంలోని హక్కులు తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రైనింగ్ ఎస్ఐ జయశ్రీ మాట్లాడు తూ గ్రామంలో ఏ సమస్య ఉన్నా వెంటనే వారివారి మొబైల్ ద్వారా112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్రామ మహిళలు మాట్లాడుతూ 'తమ ఎస్‌సి, ఎస్‌టి కాలనీలో డ్రైనేజీ కాలువలు క్లీన్ చేయాలని, పక్కనే ఉన్న డ్రైనేజీ దుస్థితిని అక్కడికి వచ్చిన అధికారులకు చూపించారు. గ్రామంలో ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు శుభవనం, బైరెడ్డిపల్లి టు పుంగనూరు జాతీయ రహదారి రహదారి లోని బస్టాండ్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ ఈ విషయాన్ని పై అధికారులకు తెలిపి త్వరలో ఏర్పాటు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో గీత కుమారి, వీఆర్వో లావణ్య, వీఆర్ఏ వెంకటప్ప, వీఆర్‌ఏ పెద్దప్ప, గ్రామ ఎస్‌సి కాలనీ మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధే లక్ష్యం: తహశీల్దారు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆత్మకూరు హరిజనవాడలో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన పలు సంక్షేమాల గురించి, హక్కుల గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందరికీ అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేలో రైతులు పాల్గొని వారి భూముల వివరాలు నమోదు చేసుకోవడంపై స్పందించారు. గ్రామం లోని ప్రజలు డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతు న్నామని గ్రామస్తు లు తెలిపారు. ఎంపీడీ వో మనోహర్ గౌడ్ మాట్లాడుతూ త్వరలోనే డ్రైనేజ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచ్ జయచంద్రారెడ్డి, మండల సర్వేయర్ గణేష్, విఆర్ఓ రూహి ఫాతిమా, పంచాయతీ సెక్రెటరీ సురేందర్ రెడ్డి,ఏఎస్ఐ దామోదరం ,పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.




సమస్యల పరిష్కారానికి కృషి చేయండి: టిడిపి

ప్రజాశక్తి-రామకుప్పం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రజా ప్రతినిధులు, నాయకులు అధికారుల సమన్వయం తో పరిష్కారానికి కృషి చేయాలని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడా చైర్మన్ సురేష్ బాబు టిడిపి నేతలకు సూచించారు. మండలంలోని పంద్యాల మడుగు, పిఎంకె తండా, గొరివిమాకులపల్లి, బందార్లపల్లి, కొంగనపల్లి, రాజుపేట పంచాయతీలో ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచిస్తూ, సమస్యలను నమోదు చేసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు,యూనిట్ ఇన్చార్ లు కార్యకర్తల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీలో రాజకీయ విభేదాలను పక్కన పెట్టి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపుకు సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి,రామ్మూర్తి, చలపతి ,చిన్ని కృష్ణ,గుర్రప్ప,వెంకట్రామే గౌడు, విశ్వనాథ్, సతీష్, విజయ్ కుమార్,రఫీ, రవి రెడ్డి, కృష్ణా నాయక్, కామరాజ్ నాయక్ పాల్గొన్నారు.



త్వరలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్
మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లాకే తలమానికమైన పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేసి త్వరలో 33 ఎకరాలలో అన్ని సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కె రాజన్న, వైస్ ఛైర్మన్ పి.దిలీప్‌కుమార్, డైరెక్టర్లుగా ఆర్.శ్రావణి, ఆర్ హేమలత, డి వెంకటరమణ, జి జయమ్మ, ఎం శాంతమ్మ, డి ప్రియ, డి చంద్రమోహన్, జి సోమశేఖర్, పి మునిరత్నమ్మ, జీ రఘు, కెవి రెడ్డప్ప, ఎస్ నదీమ్, బి వెంకట రమణారెడ్డి, జే వెంకట మునిరెడ్డి, వి రుద్రమూర్తిలు పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించాలంటే మంచి మార్కెటింగ్ సదుపాయం అవసరమని గుర్తించి మార్కెట్‌ను మరింతగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దు రాష్ట్రాలతో ఇతర దేశాలకు ఇక్కడి ఉత్పత్తులు వెళ్లేలా కుప్పం నియోజకవర్గం వద్ద కార్గో సేవల ద్వారా రవాణా సదుపాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం కల్పించ నుందని వివరించారు. వీటితోపాటు రైతులకు సబ్సిడీ ధరలతో పరికరాలు, విత్తనాలతో పాటు అన్ని యంత్రాలను అందించి కూట మి ప్రభుత్వం వారి సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుం దన్నారు. రాష్ట్ర హస్తకళల ఛైర్మన్, ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ ప్రసంగించారు.



తరలిన టిడిపి శ్రేణులు

వికోట: పలమనేరులో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి వికోట నుండి టిడిపి శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వీకోట మండలం నుంచి కెవి. రెడ్డప్ప, డికె. ప్రియాకుమార్, రఘు, సోమశేఖర్లు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గాన్ని నాయకులు ఘనంగా సత్కరించారు. మండల అధ్యక్షులు రంగనాథ్, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రామచంద్ర నాయుడు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధులు రాంబాబు, చౌడప్ప, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, రెస్కో డైరెక్టర్ చంద్ర రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ధీరజ్, శబరిష్, పీఏసీఎస్ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, నారాయణస్వామి, నాయకులు నాగరాజు విశ్వనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్తూరు నియోజకవర్గ రాజ్యాంగ దినోత్సవ పోటీలలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ ప్రియదర్శిని ఉపన్యాసం, క్విజ్ పోటీలో గెలుపొంది నవంబర్ 26న అమరావతి సచివాలయం లో నిర్వహించ నున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. ఈ విషయం తెలిసిన చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారిణి ఇందిర విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇచ్చి అభినందన తెలిపారు. విద్యార్థినికి శిక్షణా ఉపాధ్యాయు డిగా పని చేసిన కొత్తపల్లి పాపయ్యను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హసన్ బాషాకు ప్రత్యేక ప్రశంసలు అందజేశారు.

ఐకమత్యమే మహాబలం: సీఐ



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సిఐ పరుశురాముడు, మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యం లో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నాలుగు రోడ్ల కూడలి నుండి గంగి నాయనపల్లి, సచివాలయం వరకు విద్యార్థులు 'ఐక్యతే స్వశక్తి' నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ఐక్యత, సామరస్యత ప్రాధాన్యతను ప్రజలకు చాటి చెప్పారు. సీఐ పరశురాముడు మాట్లా డుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీక అన్నారు. 562 దేశీయ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో ఆయన పాత్ర అపారమన్నారు. మొదటి ఉప ప్రధాని, హోం మంత్రిగా సేవలందించారన్నారు. రాష్ట్రాల సమీక రణలో కీలక పాత్ర పోషించి "జాతీయ ఐక్యత శిల్పి"గా ఖ్యాతి గడించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రతి ఏటా అక్టోబర్ 31న 'జాతీయ ఐక్యత దినోత్సవం'గా జరుపు కుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పరశురాముడు ట్రైనింగ్ ఎస్ఐ జయశ్రీ, పోలీస్ సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశ అభివృద్ధి, సౌభ్రాతృత్వం కోసం పాటు పడ్డారని విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులచే మారథాన్ నిర్వహించారు.

గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఐక్యత ఐక్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఇన్‌చార్జి హర్షవర్ధన్ ,ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. విజయవర్ధిని, ఆచార్య అరవింద్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యా పకేతరులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టరు టి. వెంకటస్వామి పాల్గొన్నారు.

వి కోట : విద్యార్థుల్లో జాతీయ భావం పెరగాలని వి కోట అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ సోమశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విద్యానికేతన్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం డాక్టరు ఎస్ఆర్ దామోదర్ రెడ్డి, సివి గణేష్, ఏ డి తుకారామ్, ప్రిన్సిపాల్ మునిరత్నం, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, స్థానిక రాగశ్రీ కళాశాల కరస్పాండెంట్ రఘుపతి పాల్గొన్నారు.

పలమనేరు: డీఎస్పీ డేగల ప్రభాకర్, సిఐలు మురళీమోహన్ ,ప్రసాద్ , ఎస్సైలు లోకేష్ రెడ్డి ,స్వర్ణ తేజ, మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ట్రైనింగ్ ఎస్ఐ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కుప్పం: జాతీయ ఐక్యత దినోత్సవంను పురస్కరించుకొని కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐక్యత నినాదంతో కుప్పం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం డిఎస్‌పి పార్థసారథి, కళాశాల ప్రిన్సిపల్ డి సుధారాణి, సీఐలు శంకరయ్య, మల్లేష్ యాదవ్, కుప్పం రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లి రాళ్ల బూదుగురు ఎస్సైలు బాబు, వెంకట మోహన్, శ్రీనివాసులు నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నగరి పట్టణంలో శుక్రవారం అఖండ 'ఐక్యతా ర్యాలీ'ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి
మున్సిపల్ చైర్మన్



ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత, వైద్యుల కొరత లేకుండా చూడాలని, నెత్తం కండ్రిగలో రైల్వే లైను ఏర్పాటులో తొలగించే గ్రామదేవత ఆలయానికి మరో ప్రాంతంలో స్థలం చూపాలని, కొత్తపేట శ్మశాన స్థలం సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు కోరారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ఆధ్వర్యంలో కమిషనర్ కృష్ణారెడ్డి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాను కౌన్సిలర్లు ముందు ఉంచారు. అందులో కాకవేడు సర్వేనెంబరు 12/పి, 277/2పి, 281/3పి లలో 19.833 హెక్టార్ల విస్తీర్ణంలో ముకుందమైన్స్‌కు ఎంశాండ్, గ్రావెల్, సాధారణ మట్టి తవ్వకానికి క్వారీ లీజుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అందించేం అంశం, కాకవేడు సర్వే నెంబరు 12/పి విస్తీర్ణం 7.943 హెక్టార్లు శ్రీమాథ శివప్రసాద్ బిల్డింగ్ స్టోన్‌క్రషర్ వారికి గ్రావెల్, మట్టి త్వకానికి లీజుకు ఇచ్చే అంశం, సర్వే నెంబరు 12/పి, 281/3పి విస్తీర్ణం 23.80 హెక్టార్లు సింధుప్రియ అయోధ్యపురం, వంశీరెడ్డి దుర్గంపల్లి, వరుణ్‌రెడ్డి, పాతమేకల మాధశివ వీర్లకు గ్రావెల్, మట్టికి లీజుకు ఇచ్చే అంశం, కీళపట్టు గ్రామంలో సర్వే నెంబరు 49/1పి, 49/3లో విస్తీర్ణం 15.381 హెక్టార్ల విస్తీర్ణం యన్.శ్రీధర్ అండ్ కో వారికి లీజుకు అనుమతికి, నెత్తం కండ్రిగలో 2.024 హెక్టార్లు హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ లిమిటెడ్ వారికి 30 వేల మెట్రిక్ టన్నుల మట్టి తీసుకోవడానికి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడంపై చర్చించారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి కోర్టు సమీపం స్థలం కేటాయింపు, వీధిలైట్ల ఏర్పాటు, పారిశుద్య సామగ్రి కొనుగోలు లాంటి అంశాలు చోటుచేసుకున్నాయి. వీటిపై కౌన్సిలర్లు ఎలాంటి చర్చలు లేక ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, విప్ దయానిధి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.